
★ కథానిక ★



# తప్పెవరిది?

రచన : శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మి గారు

" అయితే తప్పెవరి దంటారండీ! సుబ్బాయమ్మగారూ? నాలిక్కినరం లేదుగా! తప్పొప్పులూ న్యాయాన్యాయాలు సరిగా విచారించకుండనే వాగేస్తూవుంటుంది." అన్నారు కామాక్షమ్మగారు.

" అయితే, అసలు సంగతేమిటో చెప్పకండానే మీరు లెక్చెరు కొట్టి 'తప్పెవరిది?' అంటే నే నేమి చెప్పనండీ! అసలు తప్పుగాని ఒప్పుగాని చేసిన దెవరు? అన్యాయంగానూ అనాలోచితంగాను వాగిన దెవరు? మీ మాటల గూఢార్థ మేమిటో నాకు తెలియడంలేదండీ! చెప్పకుండా తెలుసుకు నేంత సూక్ష్మగ్రాహిని కానుసుమా" అని సుబ్బాయమ్మగారనగా అసలు కథ చెప్ప నారంభించారు కామాక్షమ్మగారు.

" అదికాదమ్మా! అదేమి చిన్నదా చితకదా! యిరవై యేళ్లు సుమారు కాపరం చేసిందాయె. బతక పోవడం మూలాన్నికాని లేకపోతే కలకల్లాడుతూ అందరిలాగే అదీ పిల్లలతో వుండవలసింది. కాదు టండీ! ముప్పై యేళ్లు దాటిన మనిషాయెకదా! సుశీల వుట్టి పుణ్యానికే మొగుడి తప్పేమీ లేకుండానే చేసే చేసే కాపురాన్ని నేలదోసుకుంటుందా? అయినా సోమయాజులుకూడా చక్కటివాడే! వాళ్ల ఆలుమొగుళ్లకు వయస్సులోకూడా అట్టే వ్యత్యాసమూ లేదు. మహావుంటే అతను దానికంటే యే డెనిమిదేళ్లో పెద్ద వుండచ్చు పేరుకలవారింటి ఆడబడుచు, చిన్నప్పటినుండి యెంతో గారాబంగా పెరిగింది. ఏదో పిల్ల సుఖపడు తుందికదా! అని వాళ్ల నాన్నగారు బోలెడు కట్నం కానుకలతో అత్తగారి ఆడబడుచుల, లాంచనాలతోనూ మహావైభవంగా అయిదు రోజులు పెండ్లి చేశారు. కట్నాలే కాకుండా దాని వంటిమీద రెండు వేల రూపాయలకు తక్కువ కాకుండా బంగారముంచే కన్యాదానం చేశారు. ఇంతకంటే యే ఆడపిల్లను కన్న తల్లిదండ్రులు యెక్కువ చేస్తారమ్మా! ఇంతకీ అదృష్టం బాగుండాలి! అది లేకపోతే యెవరేమిచ్చి లాభం లేదు.

"సోమయాజులు పెండ్లి నాటికి యాభైరూపాయల జీతం తెచ్చుకుంటున్నాడు. పెళ్లైన రెండు మూడేళ్లలో పెద్ద వుద్యోగమయింది. అప్పుడు అటువేపువారు యిటువేపువారు యిరుగుపొరుగువారు ఒకరేమిటి వాళ్ల నెరిగున్న వాళ్లంతా 'సుశీల యెంత అదృష్ట వంతురాలమ్మా! మొగుడికి వెంటనే పెద్ద వుద్యోగమైంది' అన్నారు.

సోమయాజులు పెట్టిన పేచీలన్నిటికీ ఒప్పుకుని కోటేశ్వరరావుగారు పెదమూడో యేట సుశీలను అత్తవారింటికి పంపించారు.

" కాపరానికెళ్లిన దగ్గరనుండి సుశీల కష్టాలకి అంతు లేకపోయింది. మూడు మూడు రోజులకీ కొట్టడం, తిట్టడం,

డబ్బు తీసుక రమ్మని పుట్టింటికి తరమడం. ఇంతకీ? అన్న దమ్ములు మంచివాళ్లు కనుక ఒక ఆరు నెల్లపాటు చెల్లెలిని దగ్గిర పెట్టుకుని అంతో యింతో చేతికిచ్చి, విలువగల చీరెలూ, బత్తి ఖర్చులూ పెట్టి కూడా వెళ్లి దాన్ని భర్త దగ్గర దిగబెట్టి వచ్చేవారు. అయితే యేం లాభం! వచ్చిన మూడో నాడే 'యథాప్రకారపు సిద్ధిరస్తూ' ఆరంభం దెబ్బలాటలు. చచ్చేలాగ వంట చేయించడం! తాను అనవసరంగా అలగడం! తాను తినకపోవడం! దాన్ని తిననియ్యక పోవడం. పిల్ల చిన్నదాయె. ఆకలికి ఓర్చుకోలేక నీళ్లు తాగి తాగి పడిపోయేది. ఇరుగు పొరుగువారితో కూడా చెప్పేది కాదు. ఇదే వరుస రోజూను. నెలకు సగం రోజులు వెన్నెల, సగం రోజులు చీకటి అందరికీ అయితే పాపం! సుశీల జీవితానికి యెప్పుడూ చీకటే అయింది. ఏం చేస్తుంది.

ఒకసారి గర్భిణీగా వున్నప్పుడు కోపగించి తన్ని వీధిలోకి గెంటి ఘడియ వేసుకున్నాడు గూడాను. ఇరుగు పొరుగు వారు యెంతో జాలిపడ్డారు. యేమి లాభం! పిలిచి ఆదరిస్తే మరీ చంపుతాడని భయమాయె. అట్లానే యెండలో సాయంత్రందాకా గుమ్మంలోపడి వుందిట. చూసిన వాళ్లు చెప్పారు. పిల్లాడు పుట్టి మూడేళ్లు బతికిపోయాడు. పిల్లల మీదకూడా అతనికి ఆప్యాయత వున్నట్లు కనపడదు. భార్య మీద వున్న ప్రేమ కనిపిస్తూనే వుందిగా! నలుగురు పిల్లలు పుట్టి పోయారు. పిల్లలు బతికి వున్నప్పుడు కూడా అతని ధోరణి యేమీ మారలేదు. కోపమొస్తే తల్లితోపాటు పిల్లలను కూడా వీధిలోకి యీడ్చేవాడు. ఈ పరిస్థితులలో ఆ పిల్లగతి యేమిటీ! ఆ పిల్లమనఃస్థితి యేవిధంగావుంటుందో మీరే ఆలోచించండీ!

"సంసారంలోనా సుఖము లేక పోయే, రోజువిడిచి రోజు పస్తే నాయె—పుట్టిన పిల్లలా లేరాయే, మొగుడా చూస్తే కర్కోటకుడాయె. ఏం చేస్తుంది, పాపం? వదిలేసి పుట్టింట్లోవుంటే 'మొగుణ్ణి వదిలేసింది రాక్షసి' అంటుంది సంఘం. పోనీ అన్నదమ్ములే వెళ్లి తీసుక వచ్చేదామన్నా, పలువురి నోళ్లను చూచి వెరచేవారు. వారికి కూడ చెల్లెలి బాధలు బాగా తెలుసు. ఆడ పిల్ల వేపు వారు కనుకనే నిస్సహాయులయ్యారు.

"ఇరుగు పొరుగున్న భార్యాభర్తలను చూచి యెంతో ముచ్చట పడేది. వాళ్లెంత వద్దిగా, ప్రేమగా వున్నారు. 'నాకు అల్లాటి అదృష్టం లేకపోయెనే దేవుడా' అని దుఃఖించేది. తనలో తానే కుళ్లిపోయేది. భర్త ధోరణి ఆ విధంగా వుంటే తనకి మాత్రం యేమి సంతోషముంటుంది. కాని యిరుగు పొరుగువారి కోసరమైనా సంతోషంగా వున్నట్లు కనపడాలిగా! మొగుడు పుణ్యంపుచ్చి బతికే వున్నాడాయె. పువ్వులు అవీ పెట్టుకోక పోతే, 'యేమిటమ్మాయిదీ! దీని ఓగాయిత్యానికి అంతు లేకండా వుందే. మొగుడన్నాక కొట్టకుండా తిట్టకుండా వుంటాడుటమ్మా! యేదో కొంచెం చెయ్యీ నోరూ చేసుకున్నాడు గదా! అని పువ్వులెట్టుకోకా, తల దువ్వుకోక చీకటి జీమూతం లాగ వుంటుందా? ఆఁ ఆఁ అదుపాజ్ఞలు లేకపోతేసరి' అంటారు అమ్మలక్కలు. అందుకని ఒక పక్క కుళ్లి యేడ్చి చస్తున్నా, లేవంగానే తల దువ్వుకుని వుంటే పువ్వులెట్టుకొని, కాటికీ బొట్టూ పెట్టుకుని, శుభ్రమైన చీరె కట్టుకుని, తన బాధని యెదటి వారికి కనపరచకుండా వుండేది పాపం సుశీల. అట్లావున్నా రోజులు గడిచేవా! 'ఇటునుయ్యి అటుగొయ్యి అన్నట్టు' వీధిలో వారేమనుకుని పోతారో అని అది అవస్థపడుతుంటే ఇంక సోమయాజుల ధోరణి యేమిటీ? 'తెల్లవారి తెల్లవారక ముందే తయారయ్యావే! నువ్వెక్కడ! ఆ రంభా ఊర్వసులుండే చోట వుండలిసిన దానివి. డాన్సుకూడా నేర్చుకో బాగుంటుంది! నీ ఖర్మ మండి నా పాలబడ్డావుగాని లేకపోతేనా, అసలు యీ మాత్రమైనా నిల్చే దానివిటే? నీ షోకులూ నీ ధోరణీ చూస్తుంటే శృతిమీరి రాగాన పడుతోంది. ఎవ్వరినైనా పాతికేళ్ల వాడిని వెతుక్కో సరిపోతాడు.' అని ఒకటేమిటి యేడిపించుకు తినేసేవాడు. షోకేమిటమ్మా! తల దువ్వుకుని బొట్టూ, కాటికీ పెట్టుకోడం షోకా! తాను యెద్దులాగ యెదురూగా వుండగా, బొట్టూ, కాటికీ పెట్టుకోకుండా యెల్లా వుంటుందమ్మా!

"తనంతట తాను వెళ్లి యిరుగు పొరుగువారికి చెప్పక

పోయినా సోమయాజుల కేకల వలన, యింట్లోవున్న నౌకర్ల ద్వారా వూళ్లో అందరికీ తెలిసింది. ఆ వూర్లోనే గాదు, చుట్టుపక్కల గ్రామాదుల్లోనూ తెలిసిపోయింది. ఏమనీ! 'సోమయాజులుగారు భార్యని వేపుకు తినేస్తున్నాట్ట' అని. ఇది ప్రజ్ఞా? భార్యని అల్లరి పెట్టి యేడ్పించడం! దాన్ని యేడ్పిస్తే తనకేమట్టుకు సుఖమేమిటీ ఏమో లెండి! యెవరికి తెలుసు! సుఖం లేకపోతే రోజూ అల్లా యెందుకు యేడ్పిస్తాడు దాన్ని!

"రోజులు గడిచేకొద్దీ సంసారమంటే విరక్తి, భర్తంటే విరక్తి పుట్టుకొచ్చింది దానికి. పుట్టుకు రాదా? ఎంత కాలమని ఓర్చుకోడం? ఇరవై యేళ్లపాటు వోర్చుకుంది.

"అనుకోకుండానే పొరిగింటి వారితో బాగా పరిచయమైంది. వాళ్లు దీని స్థితిగతులను చూచి చాలా జాలిపడేవారు కూడాను. వాళ్లబ్బాయి శేషగిరితోకూడా దీనికి పరిచయం కలిగింది. అతనికి యిదంటే మొదట్లో చెప్పలేనంత జాలి.అల్లాఅల్లా కొంత కాలానికి ఆజాలి ఆప్యాయంగా మారింది. భర్త తన మనస్సుని పూర్తిగా విరిచివేయడం మూలాన్ని తాను మన స్ఫూర్తిగా ఆ విధంగా వుండాలని అనుకోకుండానే, సుశీలా శేషగిరుల స్నేహం ఆనాటి కానాటికి వృద్ధి కాజొచ్చింది. ఇల్లాటివి దాగు తాయా మరి. న్యూసుపేపరు యేజంట్లలాగ అనవరతంగా పనిచేసే అమ్మలక్కలుంటారుగా! కథలు కల్పించి జారేసేందుకు! ఆనోటాపడి సోమయాజులకు తెలిసింది.

"ఆత్తేరీ దౌర్భాగ్యురాలా! పో నా యింటినుండి! నీవు చచ్చినదానితో సమానం! అని బ్రాహ్మణులను పిలిపించి బతికున్న సుశీలకు ఘటశ్రాద్ధం పెట్టేశాడు. లక్షణంగా దక్షిణతాంబూలాలను తీసుకుని గారెలూ అరిసెలూ మస్తుగా మెక్కి బతికిన వాళ్లకే శ్రాద్ధం పెట్టించే బ్రాహ్మణులు సోమయాజులిని వేయినోళ్ల పొగిడి మరీ వెళ్లారు.

ఆ పరిస్థితులలో సుశీల గతి యేమిటి? మొగుడ్కా చచ్చిందానికి పెట్టినట్టు పన్నెండు రోజులూ మైలపట్టి ఘటశ్రాద్ధం పెట్టేశాడు. అంతే కాదు. ఊరందరికీ పూర్తిగా తెలుసో తెలియదో అని కాగితాలమీద టూకీగా రాయించి తన భార్య యొక్క ప్రవర్తనను గోడలమీద అంటింపించాడు. పోనీ పుట్టింటికి పోదామా అంటే లోకులు కాకులై పొడుస్తారు కదా! మరి కానున్న కర్తవ్య మేమిటి? ఏ నూతిలోనే గోతిలోనో పడి చావడమా, లేకపోతే తన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్న శేషగిరినే ఆశ్రయించడమా? తాను యింతకీ చేసిన పాపం మటుకూ యేమిటీ? ప్రేమ లేని భర్త ఘటశ్రాద్ధం పెట్టినా ఆ గుమ్మం వద్దనే పడి వుండ లేదనా యీ సంఘానికి ఆమెపై కోపం! లేకపోతే శేషగిరితో వుండి పోతుందని యెందుకూ ఆ గుసగుసలు? దాన్ని తిట్టని వారు లేరే.

"ఏమండీ! సుబ్బాయమ్మగారు! మీరైనా న్యాయాన్యాయాలు ఆలోచించి, సుశీల సోమయాజులలో తప్పెవరిదో చెప్పండి. సుశీల తనంతట తనే చేసే చేసే కాపురాన్ని కాల దన్నుకొని పోయిందంటారా? మరి మీరేమంటారూ?"

"అది సరే లెండి! కథ అంతా భలే బాగుంది గాని, అయితే యీ కరువు రోజుల్లో రేషను బియ్యంగదా! ఆ ఘటశ్రాద్ధ మేమిటంటా! ఆ పెట్టే తిండి బీదవాళ్లకైనా పెడితే బాగుండేదే! ఘటశ్రాద్ధం పెట్టి పన్నెండు రోజులూ మైలపట్టినంత మాత్రాన సోమయాజుల పెళ్లామనడం మానేస్తారా ప్రపంచం! అల్లాటప్పుడు యీ దండుగ్గూడా యెందుకూ! నాకు కడుపు చక్కలయ్యేలాగ ఒక్క దానికి నవ్వొస్తోందమ్మా, ఆ గోడల కంటించడా లేమిటి! నయం, తన వీపుక్కూడా అంటించుకున్నాడు గాదు! మొత్తంమీద భలేవాడే ఆ అబ్బాయి! అని సుబ్బాయమ్మగారంటే—"
అదేమిటమ్మా, అబ్బాయంటా రేమిటీ? మనమలనెత్తె యాడు గదా! ఒక్క గోడల కంటించడమే కాదు— (రహస్యంగా దగ్గరకు జరిగి) ఇంకా యింకా అవక తవక పన్లు చాలా చేశాడు లెండి. చెప్పుకుంటే సిగ్గుచేటు. మాకు మాకు ఒక విధాన వాడు బంధువే—అదీ బంధువే.— సోమయాజులు మావేలు విడిచిన మేనమామ భార్యకు పిన తండ్రి కొడుకు" అంది కామాక్షమ్మగారు.

"పోనీ లెండి కామాక్షమ్మగారూ మన కంటే చిన్నవాడేగా! నే నవొచ్చే దేమిటంటే, 'చదువుకున్న వాడి

కంటే చాకలాడు మెరుగన్నారు పెద్దలు. కనుకనే చదువు కున్నంత మాత్రాన ప్రపంచజ్ఞాన మొస్తుందాండీ? లేకపోతే ఆ అల్లరేమిటీ? చాతనైతే తానే నయానా భయానా తన భార్యను చెప్పుకుని, సరియైన మార్గానికి తెచ్చుకోవాలి. లేకపోతే గప్‌చిప్పుమని నోరుమూసుకుని యిష్టంలేనప్పుడు తన మానాన్ని తాను దాని ప్రమేయ మేమీ లేకుండా వుండాలి. అంతే గాని యీ తెలివి తేటలేమిడీ గోడలమీదా కొమ్మల మీదా! కాయితాలంటిస్తే నలుగురూ తనని చూసి నవ్వరుటమ్మా! అయ్యో వెర్రి, ఇదొక కక్షసాధించటం కాబోలు. అతని ఆఫీసులో బంట్రోతులే అతని వీపు వెనుకాల నవ్వుతారు చెప్పుకుని. కొన్నాళ్లు పోతే మొహమెదురుగుండానే నవ్వగలరు. ఎవరి పిచ్చి వారి కానంద మంటారు దీన్నేగాబోలు.

"సుశీల మంచి పనే చేసింది లెండి. ఎందుకూ నూతిలో గోతిలో పడి చావడం—యీ దౌర్భాగ్యపు మొగుడితో కాపురం చేసే కంటే చావే మేలను కోండి!—యెల్లా చేసిందోనమ్మా ఆ అమాయకపు పిల్ల యిరవై యేళ్లు యీచాదస్తుడితో కాపరం!!


# వింత గొలిపే ధరలు

మా సొసైటీ తాలూకు విక్రయ శాలలలో దొరికే మేలురకం చేనేత గుడ్డలు మామూలు మార్కెటు ధరలకన్న నూటికి 10 మొదలు 20 వంతులు తక్కువ ఖరీదులో వుంటాయి. ఎందుకంటే ఇక్కడ మధ్యవారి లాభాలువుండక, కొనే వారికి ఫాక్టరీ ధరలకు గుడ్డ లభ్యమవుతుంది. సరుకెప్పుడు తాజాగా వుంటుంది నమూనాలు అతినవీనంగా, అనేక రకాల అభిరుచులకు అనుకూలంగా వుంటాయి. రంగులు ఎంతో అందంగా వెలవనివిగా వుంటాయి. నేత బహు గట్టిగా వుంటుంది. ఘనిష్ఠకకూ, వాడుకకూ చేనేత గుడ్డను మించినదిలేదు.

సరాసరి మగ్గాల మీదినించి మీకు:

ధోవతులు - చీరెలు - షర్టింగులు - తువ్వాళ్లు - అద్దకాలు - జంపకాణాలు
చీటిగుడ్డలు - కప్పడాలు - టేబిల్ లినెన్ - దుప్పట్లు - దుమాళ్లు - లుంగీలు
వుత్తరీయాలు - దోమతెరలు - మెత్తలు - దిండ్లు అన్నియు దొరకును.

## మద్రాస్ కోఆపరేటివ్ చేనేత గుడ్డలు

నిర్ణయ ధరలకు తాజా సరకు

మద్రాసు హ్యాండులూమ్ వీవర్స్ ప్రొవిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్

2:, సుంకురామ చెట్టి స్ట్రీటు, జి. టి. మద్రాసు.